**జరిగిన కథ :** కాశీలో చదువుకున్న ఏడుగురు మిత్రులు.. ధారా నగరంలో కలుసుకుని, భోజరాజు వద్ద ఉద్యోగాలు సంపాదించుకోవాలని తీర్మానించుకున్నారు. వారిలో మొదటివాడైన దత్తకుడు అనేవాడు యక్షుని శాపం వల్ల స్త్రీగా మారి, భోజరాజు కూతురి వద్ద చెలికత్తెగా మారాడు. రెండోవాడైన గోణికాపుత్రుడు అప్పుడే ధారానగరానికి చేరుకున్నాడు.






# దత్తకుని శాపవిముక్తి

అనుసృజన: **నేతి సూర్యనారాయణ శర్మ**

గోణికాపుత్రుడు వేశ్యాపుత్రికలిద్దరితో కలిసి ధారానగరం చేరుకున్నాడు. ఆ రాత్రికి వారంతా ఒక సత్రంలో బస చేశారు.

తెల్లవారి లేచి చూసేసరికి చిత్రసేన, రతిమంజరి, బండివాడు కూడా కనిపించలేదు. గోణికాపుత్రుడు నగరంలోనూ, తాము వచ్చిన దారిలోనూ చాలా దూరం వెళ్లి చూశాడు. కానీ, లాభం లేకపోయింది. చేసేదిలేక ఉత్తచేతులతో ధారానగరానికి తిరిగి వచ్చాడు.

రెండురోజులు పోయిన తరువాత, పండితవేషం ధరించి కోటకు వెళ్లాడు. భోజరాజు నగరంలో లేడు. రాజ్య వ్యవహారాలన్నీ చిత్రసేనుడు నిర్వహిస్తున్నాడు. గోణికాపుత్రుడు అతణ్ని ఉద్దేశించి కొన్ని శ్లోకాలు రచించి లోపలికి వెళ్లాడు. రాజపుత్రుడు అప్పుడు మంచంపై పడుకుని ఉన్నాడు. తనకు దేహంలో స్వస్థత లేదని, ఇప్పుడు కవిత్వం వినే ఓపిక లేదని చెబుతూ.. కొన్ని వరహాలు కానుకగా ఇవ్వబోయాడు రాజపుత్రుడు.

అప్పుడు గోణికాపుత్రుడు..

''రాజపుత్రా! నేను విత్తార్థినై రాలేదు. మీ సంస్థానంలో విద్వాంసులున్నారని విని, వారితో వాదించడానికి వచ్చాను. చూడబోతే మీరేదో మానసిక సమస్యతో బాధపడుతున్నట్లుగా ఉన్నారు. దీనికి నేను మందివ్వగలను'' అన్నాడు.

ఆ మాటలతో రాజపుత్రుని ముఖం వికసించింది.

''కూర్చోండి. మీరు మా బాధ గ్రహించినట్లున్నారు. దీనికి ఔషధమేమిటో సెలవివ్వండి'' అని అడిగాడు.

గోణికాపుత్రుడు రాజపుత్రునికి దగ్గరగా జరిగి..

''మీరు ఎవరిపైనో మనసు పారేసుకుని, విరాళిలో మునిగిపోయారు. అవునా?!'' అని అడిగాడు మెల్లిగా..

రాజపుత్రుడు వెంటనే ఎక్కడలేని భక్తి ప్రదర్శించాడు. రెండు చేతులూ జోడించి..

''మహాత్మా! చారుమతి అనే వేశ్య నా హృదయాన్ని ఆకర్షించింది. ఆమెది జనాతీత సౌందర్యం. కానీ, అందరాని పండులా మారింది. మా సోదరి అంతఃపురంలో ఉంటున్నది. ఆమెను చూసింది మొదలు.. నన్నీ వ్యాధి పీడిస్తున్నది. మీరే నన్ను ఎలాగైనా రక్షించాలి'' అన్నాడు.

గోణికాపుత్రుడు అభయమిస్తూ..

''అలాగే. ఒక్కసారి నన్ను ఆ అమ్మాయిని చూడనిస్తావా?'' అని అడిగాడు.

రాజపుత్రుడు వెనువెంటనే..

'కాశీనుంచి ఒక పండితుడు వచ్చాడు. అతనికి సంస్థాన కవులకు రేపు వాదాలు జరుగుతాయి. చారుమతి మహావిద్వాంసురాలు అని విని ఉన్నాం కనుక, రేపటి సభకు ఆవిడ మధ్యవర్తిగా వ్యవహరించాలని కోరుతున్నాం' అని సందేశం పంపించాడు.

మరునాడు యథాకాలానికి సభ జరిగింది. సభలో ఒకవైపు తెర కట్టించారు. రాజపుత్రికతోపాటుగా యక్షుని శాపంతో చారుమతిగా మారిన దత్తకుడు కూడా కూర్చున్నాడు. ఆనాటి సభలో భోజ, కాళిదాసులిద్దరూ లేరు. మిగిలిన పండితుల మధ్య గోణికాపుత్రునితో రెండుగంటలకు పైగా వాదోపవాదాలు జరిగాయి. మధ్యవర్తి తీర్పు లేకుండా గోణికాపుత్రుని ఎదుట భోజరాజు ఆస్థానంలోని పండితులందరూ ఓటమిని అంగీకరించారు.

అప్పుడు రాజపుత్రిక ప్రోత్సాహం మీదట చారుమతిగా ఉన్న దత్తకుడు వాదన మొదలుపెట్టాడు. తెర అడ్డుగా ఉంది. తెరలోపల ఉన్నది తన మిత్రుడేనని గోణికాపుత్రునికి తెలియదు. గొంతును బట్టి, పేరునుబట్టి అవతల ఉన్నది తన మిత్రుడేనని దత్తకునికి తెలుసు. ఇతని బలాలు, బలహీనతలేమిటో కూడా స్పష్టంగా తెలుసు. దాంతో దత్తకుని గెలుపు నల్లేరు మీద బండినడక అయ్యింది. గోణికాపుత్రుడు తన ఓటమిని ఒప్పుకోక తప్పలేదు. రాజపుత్రి, చారుమతి అతనికి దర్శనం ఇవ్వకుండానే లోనికి వెళ్లిపోయారు.

''మహాత్మా! ఇలా చేశారేమిటి? పోనీ.. ఆమె నైజం కనిపెట్టారా?!'' అని అడిగాడు చిత్రసేనుడు.

అందుకు గోణికాపుత్రుడు..

''రాజపుత్రా! ఆమె చాలా చదువుకున్నది. ఆమెను వాదంలో ఓడిస్తే తప్ప నీకు లొంగదు. ఆమెను ఓడించగలవాడు మా మిత్రుడైన దత్తకుడు మాత్రమే. అతను కూడా నాతోపాటు ఈ ధారానగరానికే వస్తున్నాడు. మరికొద్ది రోజుల్లో ఇక్కడికి చేరుకోగలడు. అప్పుడు ఈమె సంగతి చూద్దాం'' అని అభయమిచ్చాడు.

చేసేది లేక రాజపుత్రుడు ఊరుకున్నాడు. రోజులు గడుస్తున్నాయి. యువరాజు చేసిన సౌకర్యాలతో గోణికాపుత్రుడు ధారానగరంలో హాయిగా ఉన్నాడు. దత్తకుడి రాకకోసం ఎదురు చూస్తున్నాడు.

* * *

చూస్తుండగానే ఏడాదికాలం గడిచిపోయింది.

ఒకనాటి రాత్రి చారుమతికి, రాజపుత్రిక రుక్మిణికి అర్ధరాత్రి దాకా కామశాస్త్రంపై చర్చలు జరిగాయి.